


రాత్రి గడిచింది. సూరీడు కొండ ఎనకాల నుండి మీదికి నెగకముందే అప్పలరాజు వొటేలు ఓపిను చేసేసాడు. టంచనుగా టయిముకు రోజూ తీస్తాడు. ఒక గంట టీ మాత్త రమే అమ్ముతాడు. ఆ వీధిలో నిద్రప ట్టక తెల్లారకుండా లెగిసిపొయ్యేవాళ్లు చాలామంది ఉన్నారు. ఆ దారిలో పొలం పనులకు తట్టా పారా పట్టుకొని ఎల్లేవాళ్లు కూడ చాలామంది న్నారు. ఆ టయిములో ఆళ్లందరి టీ బేరం వస్తాది. తర్వాత దోసె మాష్టరు, వాళ్ళతోబాటు పిండి కలిపేవాళ్లు వస్తారు. అప్పటి నుండి టిపిను వొటేలు లాగా చలామణి అయిపోతుందా టీ కొట్టు. యాపారం సుకంగానే నడుస్తూంది. దోసె మాస్టరు అసలు పేరేటో చాలామందికి తెలీదు. తెలిసిన వాళ్లు మరచిపోయేరు. అడిగిన వాళ్లకు పైడిరాజు అని చెబుతాడు.

# కొత్తదారి

## డా॥ బి.యస్.ఎన్. మూర్తి

ఆ వొటేల్లోనే నరసి లేక నరసిగాడు క్లీనరు కుర్రాడుగా పనిచేస్తున్నాడు. వాడి అసలు పేరు నరసింహం, వాడికి ప్లేటులు కడగడంలోనూ గలాసులు తోమడంలోనూ అనుబవం వచ్చేసింది. వీలు చిక్కినప్పుడల్లా దోసె మాస్టరు దోసెలెయ్యడం చూసేవాడు. అతడిచ్చిన దోసెలు తినడం కోసం కూర్చుని ఎదురు చూస్తున్న కస్టమర్లని చూసి నరసి ఆచ్చర్యపోయేవాడు. ఆ దోసె మాస్టరుకున్న డిమాండు ఎక్కువే. తనూ ఎప్పటికైనా దోసె మాట్టరు అవుదామని ఆ పదేళ్ల వయసులోనే కలలు కనేవాడు.

ఆ రోజు పొద్దుటేల లేబరు ఇనస్పెట్రు దిగిపోనాడు, వొటేలు కాడకొచ్చి గదమాయించేడు. "ఏటీ చిన్న పిల్లల చేత పని చేయిస్తున్నారూ?" అంటూ హడలుగొట్టేసాడు. అప్పలరాజు గుండి గుబేల్మంది. ఇనస్పెట్రు అతడ్ని సూసిన సూపు మర్డరు సేసినోడ్ని జడ్జి చూసినట్టుంది. గుళ్లోకి సెప్పుల్తో యెల్లిన భక్తుడ్ని పూజారి సూసినట్టుంది. గోరం జరిగిపోయింది. "చదువు కోవాల్సిన పిల్లలు బడికి ఎల్లనీకుండా ఆళ్ల సేత పని చేయిస్తున్నావు" అన్నాడు ఇనస్పెక్టరు. అప్పలరాజు బయపడ్డాడు. నిజంగా బయపడింది కేసు పెట్టేస్తాడనికాదు. కేసు లేకుండా చేసేందుకు ఎంత మామూలు అడుగుతాడోనని. అయినా వేడుకొన్నాడు. "నేనేమీ పిలిసి ఆ కుర్రాడిని పనిలోకి ఎట్టుకోలేదు. ఆడి బాబే బతిమాలి ఇక్కడ ఎట్టాడు. కావలిస్తే ఆ కుర్రాడినే అడగండి" అన్నాడు.

"అవును, మా అయ్యే నన్నిక్కడ పనిలోకి ఎట్టాడు. నాకు రోజూ పనిచేస్తున్నందుకు టిపిన్లు ఎడతాడు. డబ్బులు కూడా ఇస్తాడు." అన్నాడు నరసి.

"ఆ డబ్బులేం చేస్తున్నావ్?" అడిగాడు ఇనస్పెక్టర్.

"మా అయ్యే తీసుకొంటాడు, నా దగ్గర ఉండవు."

"ఇది చాలా తప్పు, నువ్వు హొటేల్లో పనిచెయ్యకూడదు, బడికి వెళ్లి చదువుకోవాలి." అన్నాడు ఇనస్పెక్టరు."

"మరి నాకు రోజూ రెండు పూటలా టిపినూ కాఫీలు బళ్లో ఇస్తారా?" అడిగాడు నరసి.


"నీ వయస్సు వాళ్లకు తిండిపెట్టి చదువు చేప్పే బళ్లు చాలా ఉన్నాయి. ఎక్కడైనా చేరు." అన్నాడు ఇనస్పెక్టరు.

నరసి కాసేపు ఆలోచించి అడిగాడు. మరి బళ్లో దోసెలు ఎయ్యడం నేరుపుతారా?" అడిగాడు.

ఇనస్పెక్టరు ఆదేమీ వినిపించుకోలేదు. అప్పలరాజు వైపు తిరిగి "నేను రూల్సు ప్రకారం వెళ్లాల్సిందే. కేసు కట్టేస్తాను." అన్నాడు. అప్పలరాజు బతిమాలాడు. అతగాడు కనికరించలేదు. జేబులోనుండి వంద రూపాయల నోటు తీసి అది తీసుకొని వదిలేయమన్నాడు. "ఏటి? వంద రూపాయలు? నేను సిన్సియరు." అన్నాడు ఇనస్పెక్టరు. అప్పలరాజు

మరో వంద కలిపి రెండు వందలు ఇవ్వజూపాడు. నేను చాలా స్ట్రిక్టు ఆఫీసర్ని.'' అన్నాడు ఇనస్పెక్టరు. అప్పలరాజు మరో వంద కలిపి మూడు వందలు ఇచ్చాడు. బేరం సెటిలయినట్టే.

ఇనస్పెక్టరు బాల కార్మిక వ్యవస్థ నుండి ఒకడిని రక్షించి దేశాన్ని ఉద్ధరించేడు. కేసు పెట్టకుండా ఒగ్గేసి అప్పలరాజుని ఉద్ధరించేడు. అతడ్ని ఒగ్గేసినందుకు



అక్కడున్న కస్టమర్లు అందరూ ఇనస్పెక్టరుని అభినందించేరు. ''రూల్సు మడిసే, కాని మంచోడు.'' అన్నాడొకడు. ఏమయితేనేం. నరసికి ఉద్యోగం పోయింది. కాని వాడికో డౌటు ఉండిపోయింది. ఇనస్పెట్రు మంచోడా సెడ్డోడా? మంచోడయితే తన ఉజ్జోగం ఎందుకు ఊడగొడతాడు?

తర్వాత ఏదో స్వచ్ఛంద సంస్థ వారికీ విషయం తెలిసింది. వారు ప్రక్కనే పల్లెటూళ్లో ఉన్న నరసి తల్లిదండ్రులను కలిసారు. ఆళ్లని ఒప్పించి నరసిని బాల కార్మికులకోసం పెట్టిన బళ్ళోల చేర్పించారు. వాళ్లు వాడికి దోసెలు చెయ్యడం నేర్పలేదు. అక్షరాలు సెప్పడం మొదలెట్టేసారు. ఎందుకొచ్చిందో ఏటోగాని ఆ బళ్లో చేరిన నాలుగోరోజునే నరసికి జొరం వచ్చింది. స్కూలు వాళ్లు మాత్తరలు ఇచ్చారు, తగ్గలేదు. దగ్గర ఉన్న గవన్నమెంటు ఆసుపత్రిలో చూపించారు. నాలుగు రోజులయినా తగ్గలేదు. వాడి జొరం తగ్గించలేక వాడింటికి దిగబెట్టేసి వాడి అయ్యకు అప్పజెప్పేసారు. ''జొరం తగ్గేక వచ్చి మా బడికి మళ్లీ తీసుకువెల్తాం. అందాకా వైద్యం చేయించు'' అన్నారు.

నరసి అమ్మ వాడిని చూసి లబోదిబోమంది. ''సూసావా, ఆడి వంటికి సదువు నప్పదు. ఎలా జొరం వచ్చేసిందో, ఈడ్ని ఇంకెప్పుడూ బళ్లోకి పంపకూడదు'' అంది, ''అవును అలాగే'' అన్నాడు అయ్య. వాడికి జొరం తగ్గిపోతే అమ్మ తల్లికి ఉపారాలు ఎడతానంది. మరో నాలుగురోజులు అక్కడా ఇక్కడా తిప్పి వైద్యం చెయ్యించింది. చివరికి జొరం తగ్గింది. అమ్మతల్లికి తెలగపిండి కూర, బూర్లు, ఉపారాలు పెట్టింది.

జొరం తగ్గిందని తెలుసుకొని స్వచ్ఛంద సంస్థవారు వచ్చారు. వాళ్లని అంతదూరం నుండి చూసి నరసి తల్లి వాడిని దాచేసింది. ఆడు మేనమామ ఇంటికి సంద్రప్ప వలస వెళ్లాడంది. అబద్ధం చెప్పింది. వాళ్లు వెళ్లిపోయారు. నరసిగాడికి బడిలో చేరే బాధ తప్పింది.

పది రోజులు గడిచాయి. నరసికి ఊళ్లో తోచిన చోట తిరగడమూ, పెద్దగెడ్డ దగ్గర అడుగులోతు నీళ్లలో తడుస్తూ కూచోడంతోటే సరిపోయింది. ఒక్కోరోజు అమ్మా అయ్యా కూలి పనులకు ఎల్తుంటే వాళ్ల ఎనకాలే ఎల్తూ కాలచ్చేపం చేస్తూ వచ్చాడు. వాడికి ఒకసారి ఊరి బయట గోవిందు తారసపడ్డాడు. వాడు నరసి కన్నా రెండేళ్ల పెద్దే. ఏడాది క్రిందట వాడిని బాల కార్మికుల బళ్లో స్వచ్ఛంద సంస్థవారు చేర్పించారు. వాడు నరసిని గుర్తుపట్టి పలుకరించాడు. వాడు పది దినాలు సెలవులకని వచ్చాడట. సెలవులయిపోగానే మళ్లీ బడికి చదువుకొందుకు వెళ్లిపోతాడట. ఇద్దరూ కబుర్లు సెప్పుకొంటూ, ఆర ముగ్గిన జాంపళ్లు కొరుక్కుంటూ వస్తూండగా దారిపక్కన బోరుకోసం వేసిన షెడ్డు గోడ మీద అంటించిన సినిమా వాల్ పోస్టరు కనబడింది. పోస్టరు మీద ఆడామగా బొమ్మలున్నాయి. కిందన అచ్చరాలున్నాయి.

''ఏటా సినిమా?'' నరసి అడిగాడు.

గోవిందం అక్షరాలు కూడబలుక్కుంటూ చదివాడు ''అ.... రుం... ధ...తి.''

''నీకెలా తెలుసు!'' నరసి అడిగాడు.

''అచ్చరాలు బళ్లో నేర్పారు. అందుకే సదివేసాను.'' అన్నాడు గొప్పగా.

తర్వాత గోవిందం వాళ్ల బడి గురించి చాలా యిషయాలు చెప్పాడు. అక్కడ అచ్చరాలు నేర్పుతున్నారని చెప్పాడు. అమ్మ, అయ్య, కాకి, పలక ఇలాంటివన్నీ వాడు రాసీగలడట. ఇంకా వాళ్ల బడిలో చాలా యిసయాలు సెబుతున్నారనీ చెప్పాడు. ''అవేటంటే సుట్టా, బీడీ కాల్చకూడదు. మందు తాగకూడదు. ఎక్కడపడితే అక్కడ ఉమ్మేయకూడదు. క్షయ రోగం ఉన్నవాళ్లు ఉమ్మి తొట్టెలు ఎట్టుకొని అందులోనే ఉమ్మాలట. దగ్గు ఉంటే గవన్నమెంటాసుపత్తిరిలో ఆ జబ్బు ఉందేమోనని ఉమ్మి పరీచ్చలు చేస్తారు. చ్చయ జబ్బుంటే మందులు కూడ ఇస్తారు. చంటి పిల్లలకు పోలియో జబ్బు రాకుండా చుక్కలు మందు ఏస్తారు. కోరింత దగ్గు, ధనుర్వాతం రాకుండా టీకా ఇండిషన్లు ఆసుపత్తిరిలో ఇస్తారు. ఇందులో ఏటికీ డబ్బులుచ్చుకోరు. ఇంకా సాలా లోకగేనం బోదించారు. బాంకులు అప్పులిస్తాయి. బళ్లు సెదువులు సెబుతాయి. రైళ్లు పట్టాలపై నడుస్తాయి. సిప్పలు సముద్దరంలో నడుస్తాయి. ఇమానం ఆకాసంలో ఎగురుతాది. మనది బారతదేసము. దేసానికి రాజదాని డిల్లీ. అది సాలా పెద్ద ఊరు. ఎయిడ్స్ అని

ఒక జబ్బుంది. అది మంచిగ ఉండకపోతే వస్తాది. అదొచ్చినోళ్లకు పెబుత్తొమే మందులు ఇస్తాది. మడుసులందరూ ఆరోగ్గెంగా ఉండాలి. అప్పుడే దేసం బాగుంటాది... ఇయన్నీ మా బళ్లో సెబుతారు.''

''మరి దోసెలు సెయ్యడం నేరుపుతారా?'' అడిగాడు నరసి. ''దోసెలు తినడానికి ఎడతారు కాని సెయ్యడం సెప్పరు. ఆళ్లకు అది సెప్పడమే పనికాదు'' అన్నాడు గోవింద.

''ఛా! అదేమి బడి?'' అన్నాడు నరసి, అలా అన్నాడు కానీ 'బళ్లో సేరితో చాలా యిసయాలు తొందరగానే తెలుస్తాయి' అనుకున్నాడు. సెలవులయి పోగానే గోవింద వాడి బడికి ఎల్లిపోయాడు.

నరసిగాడికి రెండు రోజులు ఏమీ తోచలేదు, మళ్లీ వొటేల్లో చేరుతానని అయ్యకు చెప్పిక మారాం చేసాడు. ఆడ్ని వొటేల్లో సేర్పిస్తే తనకూ నెల తిరిగేసరికి నాలుగు డబ్బులు చేతికందుతాయని అయ్యకు ఆశ కలిగింది. అందుకే హోటలు పనిలోకి ఎట్టడానికి వాడిని తీసుకువెళ్లాడు.

అప్పలరాజు ఈసారి మరీమరీ వార్నింగులిచ్చి పని ఇచ్చేడు. బయటివాళ్లకు ఎక్కువ కనుపించకుండా వంట గదిలోనే, గలాసులు కడిగే కొళాయి దగ్గరో ఎక్కువగా ఉండమన్నాడు. ఎవరైనా ఆఫీసరు వస్తే వాడూ టిఫిను తినడానికి వచ్చినవాడిలా టేబులు దగ్గర కుర్చీలో కూకుండమన్నాడు. లేదా టిఫిను పార్సిలు కట్టించుకొనేందుకు వచ్చిన వాడిలా ఏక్షను చేసీమన్నాడు. అన్నిటికీ నరసి తలూపాడు. పనిలో మళ్లీ చేరిపోయాడు.

నాలుగు వారాలు గడిచేసరికి దోసె మాష్టరుతో వాడికి దోస్తీ ఎక్కువైంది. అతడు నరసి చేతే పెనం మీద అట్టు వెయ్యడం తిరగెయ్యడం చేయించసాగేడు. నరసికి ఆపని సరదాగా ఉండేది. ఈ నెల రోజుల్లో వాడు మరో యిసయం గమనించేడు. దోసె మాష్టరు దగ్గరికి వయసులో ఉన్న ఒకామె రోజూ వస్తున్నాది. ఆమె కళ్లు పెద్దవిగా ఉండి నవ్వినపుడు మరీ బాగున్నాదనిపించింది నరసికి. ఆమె దోసె మాష్టరుని 'పైడీ' అని పిలవడమూ, వాళ్లిద్దరూ మాట్లాడుకోవడం, గుసగుసలాడుకోవడం విన్నాడు. ఆమె ఎప్పుడూ సాయంత్రం యేల వస్తుంది. ఆ టయాములో ఆ జంక్షనులో పెద్ద బేరం ఉండదు, టిఫిన్ల సెక్షను వేగిరం ముగిసిపోతుంది. పైడిరాజుతో చాలా సేపు కబుర్లు సెప్పుకోవచ్చు. అదీ ఆమె ఉద్దేశం.

ఆ రోజు సాయంత్రం బయట నిలబడి వాళ్లిద్దరూ మాట్లాడుకొంటున్నారు. నరసికి ఏమీ తోచక వాళ్ల వెనకనే నిలబడి వాళ్ల మాటల్ని వింటున్నాడు.

ఆమె ఎదురుగా సినిమా వాల్ పోస్టరుని చూపించి ''అదేం సినిమా?'' అడిగింది.

''మగధీర'' చెప్పాడు పైడిరాజు.

''అదే హాలులో ఆడుతున్నాది?'' ఆమె అడిగింది.

''లచ్మీ టాకీసులో''

''ఎలా చెప్పేసావు?'' అంది

''ఆ సినిమా హాలు బొమ్మలే అక్కడ అంటిస్తారు.''

నువ్వు సినిమా పేరు బొమ్మల్ని సూసి గుర్తుపడతావు. ఏ టాకీసులో ఆడుతుందో ఆ బొమ్మ అంటించిన జాగాపట్టి సెబుతావు. ముందుగా సినిమా పేరు ఎవడో సెప్తే కాని తెలీదు. ఎలా బతుకుతావూ? జాగరత్త, వైజాగు బస్సు అనుకొని రాయగడ బస్సెక్కీగలవు.

''ఓస్.. సినిమా పేర్లు సదివీడమేనేటి బతకడం అంటే'' అన్నాడు పైడిరాజు అనబడే దోసె మాష్టరు.

సరేలే. నీ సంగతి మా అయ్యతో మాట్లాడాను. నీకంటూ సొంతంగా యాపారం ఉంటే నన్ను నీకిచ్చి పెళ్లి సెయ్యడానికి మా వాళ్లకు ఇష్టమే. నువ్వు ఏం యాపారం సెయ్యగలవు?'' నవ్వుతూ అందామె.

''ఇంకేటి సెయ్యగలను? దోసెలేసేవాడ్ని. వొటేలు యాపారమే సేత్తాను'' అన్నాడు.

''అలా సెయ్యి, అప్పుడు నిన్ను మనువాడ్డానికి నాకింకేటీ అడ్డుండదు'' అంది.

పైడిరాజు ఆమెను అడిగాడు. ''నువ్వు ఆ సినిమా బొమ్మ కింద పేరేటో సదివీగలవా?''

''సదవగలను''

''నువ్వెంత వరకు సదూకున్నావు?''

''నాలుగో కలాసు.'' అందామె.

తర్వాత ఆమె కాసేపు కబుర్లు చెప్పి ఎల్లిపోయింది.

మర్నాడు మద్దేనం అప్పలరాజు ఖాళీగా కూర్చున టయింలో పైడిరాజు అతడితో అన్నాడు ''నేనింక మీ ఒటేల్లో ఉజ్జోగం సెయ్యను.''

అప్పలరాజు ఆశ్చర్యపోయాడు. ''ఉజ్జోగం సెయ్యక ఏటి సేత్తావు?''

నేను సొంతంగా హొటేలు ఎట్టుకొందామనుకొంటున్నాను' అన్నాడు.

అప్పలరాజు నవ్వాడు, మళ్లీ నవ్వాడు. ''ఏటీ వొటేలు పెడతావా? నువ్వే! ఏదీ చెప్పు. ఒక ఇడ్లీ ప్లేటు పదకొండు రూపాయలు, ఒక పూరీ ప్లేటు పదమూడు రూపాయలు, ఒక మసాలా దోసె పదహారు రూపాయలు చొప్పున మూడు ప్లేట్ల ఇడ్లీ, రెండు ప్లేట్ల పూరీ, నాలుగు మసాలా దోసెలకు ఎంత బిల్లు అవుద్ది?'' అన్నాడు.

పైడిరాజు మాట్లాడలేదు. అదంతా కూడ బలుక్కొని లెక్కవేసుకొని చెప్పేసరికి అరగంట పైనే అవుతుంది తనకు. బుర్ర గోక్కుంటూ నిలబడ్డాడు.

''చూసావా డబ్బు లెక్కపెట్టడం తెలియనోడివి, వొటేల్లో ఎంత వస్తుందో ఎంతపోతుందో నీకెలా తెలుస్తాది? నువ్వేటి హొటేలు నడుపుతావు?'' అన్నాడు.

పైడిరాజు బుర్ర గోక్కుంటూనే వెనుదిరిగాడు.

నరసి అతడి ఎనకాల వెళ్లాడు. పైడిరాజు వాడితో అన్నాడు. ''మనిసి బతకడానికి దోసెలు సెయ్యడం వచ్చేస్తే సరిపోదు. ఆ సంగతి నాకీయేలే అరదమైంది. నేనిలా ఉంటే నా బతుకు పెనంమీద తెల్లారిపోద్ది. ఇప్పుడైనా సదువు నేర్చుకోవాలనుకుంటున్నాను.''

''అయితే మరి ఇక్కడ పని సెయ్యవా?'' అడిగాడు నరసి.

''చెయ్యను. నాకెవరు చదువు సెపుతారో ఎతుక్కొంటునా'' అన్నాడు.

నరసికి అర్థమైంది. వాడి బుర్ర చురుగ్గా పనిచేసింది. తనుకూడా దోసె మాస్టరు అయిపోదామనుకొన్నాడు. ''సదువుకోవాలసిన టయంలో సదువుకోవాలి. లేకపోతే ఇక్కడే ఈ వొటేల్లో పెనం కాడే ఆగిపోతాను'' అనుకున్నాడు.

వాడూ అప్పలరాజు దగ్గరికి వెళ్లాడు. ''నేను బళ్లో సేరి సదువుకొంటాను.

''అయితే మరిక్కడ పని సెయ్యవా?''

''సెయ్యను''

అప్పలరాజు సంతోషంగా అన్నాడు. ''నీ ఆలోచన కొత్తది, నీది కొత్తదారి, అదే సరైన దారి.''

*

రచయిత సెల్ : 94401 83216

## స్రవంతి

**ఒకానొక సమయంలో సెలయేరులా నా మనసులోనికి ప్రవేశించి ఉప్పెనలా నన్ను ఊపేసిన జ్ఞాపకాలు...**

నీ మీద ప్రేమతో విరహంతో... వెర్రిత్తించిన జ్ఞాపకాలు అర్థరాత్రి నిద్రలేపి నన్ను ఇక నిద్రపోనీయని జ్ఞాపకాలు..

మధురవేదనానుభూతిలో కాల్చి, నీ విరహాన్ని రుచి చూపిన జ్ఞాపకాలు...

నా కలల్ని... కాంక్షల్ని... నిజం చేసిన నిన్నటి జ్ఞాపకాలు..

నీవు గుర్తువచ్చిన ప్రతిసారీ... అంతుపట్టని ఆనందంతో...

ఉద్రేకంతో గుండెను పట్టి చీలికలు చేస్తున్న జ్ఞాపకాలు...

నా సుందర స్వప్నాలకు సాక్షులుగా... ఎప్పటికి జ్ఞాపకముండే నీ జ్ఞాపకాలు...

ఉదయాన్నే నిద్ర లేపి రాత్రి అనుభవాలను గుర్తుకు తెచ్చే జ్ఞాపకాలు...

నువ్వులేని రాత్రిళ్లు... నీ కోసం ఎదురు చూపుల వెక్కిళ్లతో రోదించే... నన్ను ఊరడించి... నువ్వెప్పుడూ నా దగ్గరున్నట్లు భ్రమింపజేసే జ్ఞాపకాలు... నువ్వు... నా దగ్గరున్నా... లేకపోయినా... నాకింకా బ్రతకాలన్న కోరికను పెంచుతున్న జ్ఞాపకాలు...

ఆ జ్ఞాపకాలు... ఈ మల్లెపూలు...

-దామా మురళీకృష్ణ,
సెల్: 94404 84972